క్లుప్తంగా

నేటి నుంచి ఫార్మేటివ్ - 3 పరీక్షలు



స్ట్రాంగ్‌రూమ్‌లో ఓఎంఆర్ షీట్లు భద్రపరుస్తున్న అధికారులు

కంబాలచెరువు: అన్ని యాజమాన్య పాఠశాలల్లో మంగళవారం నుంచి ఫార్మేటివ్ – 3 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వీటిని క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ (సీబీఏ) విధానంలో నిర్వహించనున్నామని, సంబంధించిన ఓఎంఆర్ షీట్లను ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ సోమవారం తెలిపారు. ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామని, మంగళవారం ఉదయం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష సమయానికి ఒక గంట ముందు ప్రధానోపాధ్యాయులకు అందజేస్తామన్నారు. వాటిని పరిశీలించుకుని ఏమైనా తక్కువ వస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సీఆర్పీలు జయంతి శాస్త్రి, పబ్బినీడి ప్రసాద్, జె.శ్రీనివాసరావు, నాగలక్ష్మి, కుమారి, ఇందిర, కోటేశ్వరి ఉన్నారు.

ధవళేశ్వరం సీఐగా వినయ్ మోహన్



ధవళేశ్వరం: ధవళేశ్వరం సీఐగా సోమవారం జీవీ వినయ్ మోహన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకూ విజయవాడ పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ఆకతాయిలను ఉపేక్షించేదన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద నిరంతర నిఘా ఉంచుతామని తెలిపారు. చుట్టుపక్కల ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారం ఉంటే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కాపులు కాంగ్రెస్‌తో కలిసి రావాలి

రాజమహేంద్రవరం సిటీ: రాజ్యాధికారం కోసం కాపులు కాంగ్రెస్‌తో కలిసి రావాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ పిలుపు నిచ్చారు. ఆయన సోమవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతూ చిరంజీవి మళ్లీ రాజకీయాల్లోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఆయన కాంగ్రెస్ తరఫున అసెంబ్లీకి పాలకొల్లు, తిరుపతి స్థానాల్లో ఎక్కడ పోటీ చేసినా గెలుస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీలు బీజేపీతో అంటకాగుతున్నాయన్నారు. చంద్రబాబు అయోధ్యకు వెళ్లి పొత్తు కోసం వెంపర్లాడుతున్నాడన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

27న తిరుకల్యాణ మహోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరికొండపై కొలువైన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల 24వ తిరుకల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 27వ తేదీ ఉదయం 09.45 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కామిని వెంకట రామప్రసాద్ చౌదరి తెలిపారు. బ్రహ్మశ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన వార్షిక సత్కార పండితులు కాళ్లకూరి సూర్యశ్రీ (సూరిపండు), ఆలయ ప్రధాన అర్చకులు నండూరి శ్రీకృష్ణపరమాత్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. హైదరాబాద్ వాస్తవ్యులు డాక్టర్ ముంగి నాగేశ్వరరావు కుమారుడు ముంగి గిరిధరరావు, సుజాతారాణి దంపతులచే నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశుల పోసయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సినిమాలు

శ్యామల	: సైంధవ్
సూర్యమినీ	: సైంధవ్, నా సామిరంగ
సూర్యప్యాలెస్	: గుంటూరుకారం
స్వామి	: గుంటూరుకారం
శివజ్యోతి	: నా సామిరంగ
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	: సలార్
ఊర్వశి	: నా సామిరంగ
రంభ	: నా సామిరంగ
మేనక	: హనుమాన్
అప్సర	: గుంటూరుకారం
కుమారి	: గుంటూరుకారం
నామవరం	
వీఎస్ మహల్	: హనుమాన్, నా సామిరంగ, సైంధవ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	:నా సామిరంగ, గుంటూరుకారం
కడియం	
వెంకటసూర్య	: హనుమాన్, నా సామిరంగ



గోవింద క్షేత్రంలో దీపోత్సవం



సుదర్శన హోమం చేస్తున్న చిన్న వెంకన్నబాబు స్వామీజీ



పల్ల వెంకన్న నర్సరీలో మొక్కల కూర్పునకు నమస్కరిస్తున్న మంత్రి వేణు



మురమండలో భక్తుల గ్రామోత్సవం



కడియపులంకలో మోటారు సైకిల్ ర్యాలీ

ఊరూరా మహోత్సవం

- మార్మోగిన శ్రీరామ నామస్మరణ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాజమహేంద్రవరం రూరల్: అయోధ్యలోని రామ మందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఊరూరా మహోత్సవం జరిగింది. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపాలంకరణ చేసి బాణసంచా కాల్చారు. సమాచార పౌర సంబంధాలు, బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, పార్టీ నాయకులు హుకుంపేటలోని రామాలయంలో పూజలు చేశారు. వెంకటగిరిలో వివేకానంద సేవాభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీన్‌పై అయోధ్యలో జరుగుతున్న కార్యక్రమాలను తిలకించారు.

- మోరంపూడి జంక్షన్‌లో శ్రీసాయి భక్తాంజనేయ స్వీట్‌స్టాల్ అధినేత చక్రపాణి అండ్ సన్స్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. అలాగే భజన కార్యక్రమంతో పాటు దీపాలంకరణ చేశారు.

ధర్మానికి రూపం రామావతారం

కడియం: ధర్మానికి నిలువెత్తు రూపం రామావతారం అని మంత్రి వేణు అన్నారు. స్థానిక పల్ల వెంకన్న నర్సరీలో శ్రీరాముని ఆకృతిలో ఏర్పాటు చేసిన మొక్కల కూర్పును సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపనతో దేశం మొత్తం రామనామ స్మరణ చేస్తోందన్నారు. నర్సరీ యాజమాన్యం పల్ల సత్యనారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం, గణపతి, స్థానిక నాయకులు ఉన్నారు.



హుకుంపేట రామాలయంలో పూజలు చేస్తున్న మంత్రి వేణు, చందన నాగేశ్వర్ తదితరులు



ధవళేశ్వరంలో రథంవీధి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శోభాయాత్ర

కడియం మండలంలో..

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. గ్రామగ్రామానా ఆలయాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వీరవరంలోని కోదండ రామాలయం, దుళ్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద పానకం పంపిణీ చేశారు. మురమండలో నాలుగు రామాలయాలను సందర్శిస్తూ పల్లకీ ఉత్సవం నిర్వహించారు. రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. కడియపులంకలోని ముసలమ్మ ఆలయం నుంచి కాషాయ జెండాలు ధరించి మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కడియపులంకలోని ముసలమ్మవారి ఆలయం వద్ద రామమందిరం ఆకారంలో భక్తులు దీపాలను వెలిగించారు.

రాముని బాట ఆదర్శం

రాజమహేంద్రవరం రూరల్: శ్రీరాముడు చూపిన సత్యం, ధర్మం, శాంతి మార్గాలు నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని శ్రీసత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య అన్నారు. రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో సోమవారం ఉదయం అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వారు వీక్షించారు. నిడదవోలు సూరిబాబు బృందం శ్రీరామ గాథను వివరిస్తూ ప్రత్యేక భజనలు చేశారు. అంతకు ముందుగా శ్యాంసుందర్ దంపతులు చేయించిన రామసీతాలక్ష్మణ హనుమంత సహిత పంచలోహ విగ్రహాలను గురుకులంలో వేదమంత్రాలు మధ్య ఊరేగించారు. ఈ విగ్రహాలను నగరంలోని శ్రీ సత్యసాయి మందిరంలో ఉంచనున్నట్లు తెలిపారు.

వాడవాడలా ఉత్సాహం

ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని పలు రామాలయాల వద్ద భక్తుల రామనామ జపాలను ఆలపించారు. గొల్లపేట రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు సాధనాల చంద్రశేఖర్ (శివ) ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, రాత్రి దీపోత్సవం వైభవోపేతంగా జరిగాయి. రథంవీధి రామాలయం వద్ద రథం వీధి ఫ్రెండ్స్ సర్కిల్ నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో శోభ యాత్రను నిర్వహించారు. పురవీధుల్లో స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్‌లో సందడి

ప్రకాశం నగర్: శ్రీషిర్డీ సాయి విద్యాసంస్థల విద్యార్థులు పుష్కరఘాట్‌లో అయోధ్య రామ మందిరం నమూనాను ఏర్పాటు చేశారు. దాని ఎదురుగా సుమారు 500 మంది విద్యార్థులు, సీత, రాముడు, లక్ష్మణుడు, హనుమంతుని వేషధారణలతో నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమానికి ఆర్‌జేడీ శారద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యాసంస్థల తరఫున ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం, అందులో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ఆర్‌ఐఓ నరసింహం మాట్లాడుతూ విద్యార్థులతో ఇంతటి మహత్తర కార్యక్రమం నిర్వహించిన విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య, చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

పులకించిన గోదావరి తీరం

సీటీఆర్ఐ: జై శ్రీరామ్, జై సీతారామ్ అనే నినాదాలతో గోదావరి తీరం పులకించింది. నగరంలోని పలు ఆలయాల్లో ఉదయం నుంచే విశేష పూజలు నిర్వహించారు. లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రంలో విష్ణుసహస్ర పారాయణ, హనుమాన్ చాలీసా, దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. గాడాలలోని శ్రీమహాలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామివారి పీఠంలో పీఠాధిపతి శ్రీమాన్ చిన్న వెంకన్న బాబు స్వామిజీ ఆధ్వర్యంలో శ్రీరాముని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశమంతా రామరాజ్యం కావాలని సుదర్శన హోమం జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సీతంపేటలోని శ్రీరామాలయం, గోదావరి గట్టున గల వేణుగోపాల స్వామి ఆలయంలో, గోవింద మఠంలో విశేష పూజలు జరిగాయి.



సత్యసాయి గురుకులంలో పూజలు నిర్వహిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్



పుష్కర ఘాట్ వద్ద నృత్య రూపకం ప్రదర్శిస్తున్న షిర్డీసాయి విద్యార్థులు

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): చిరు ధాన్యాల ద్వారా పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఆమె సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అసోసియేషన్ డైరీని, చిరు ధాన్యాలతో వంద పిండి వంటలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి చిరు ధాన్యాల ఏడాదిగా ప్రకటించిందన్నారు. అందులో భాగంగా మిల్లెట్స్ సాగు విస్తీర్ణం పెంచడం జరిగిందన్నారు. చిరు ధాన్యాలతో సుమారు వంద రకాల వంటలు అనే పుస్తకాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రూపొందించారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, డీఆర్వో జి.నరసింహులు, డీఏవో డాక్టర్ ఎస్.మాధవరావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణ పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టి కృషి

- మంత్రి వేణు
- పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పార్టీ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌తో కలిసి పిడింగొయ్యి గ్రామంలోని హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు నివాసంలో పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులు మంత్రి వేణుకు ఘనస్వాగతం పలికారు ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, పిడింగొయ్యి, హుకుంపేట గ్రామాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కాతేరులో పార్టీ నాయకులతో మంత్రి వేణు, ఆకుల వీర్రాజు

కాతేరు గ్రామంలో..

కాతేరులో మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు నివాసంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుతో కలిసి పార్టీ నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో గ్రామాభివృద్ధితో పాటు పలు అంశాలపై చర్చించారు అలాగే రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీనును మంత్రి వేణుగోపాలకృష్ణ కలిసి మాట్లాడారు.

అక్కినేని నటన చిరస్మరణీయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు తన నటనతో అందరి మదిలో చిరస్మరణీయులయ్యారని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతిని స్థానిక జిత్‌మోహన్ మిత్ర కళావేదికపై సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నట గాయకులు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర అధ్యక్షత వహించగా, వ్యాపారవేత్త మాటూరి రంగారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గన్ని కృష్ణ, సన్నిధానం శాస్త్రి, అక్కినేని వీరాభిమాని అడబాల మరిడియ్య తదితరులు పాల్గొని ఏఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కినేని అభిమాన సంఘం తరఫున గంగరాజు డెయిరీ అధినేత నిమ్మలపూడి గోవిందుకు అక్కినేని స్మారక పురస్కారం అందించి సత్కరించారు. కార్యక్రమంలో నూజెళ్ల సూరిబాబు, డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, గిడ్డి నరసింహ మూర్తి, వి.జగపతి, డీఏసీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అక్కినేని స్మారక పురస్కారంతో గంగరాజును సత్కరిస్తున్న ప్రముఖులు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం రూరల్: అయోధ్యలో బాలరాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించిన సమయానికి కాతేరులోని సీతారామ ఘనశ్రౌత గవాగ్రహారంలోని కల్యాణ కార్తికేయ సంతాన సుబ్రహ్మణ్యేశ్వర సహిత అభీష్ట గణపతి పంచాయతన దేవాలయంలో హనుమత్సీతా లక్ష్మణ సమేత రామచంద్రుని విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గోమయపు ప్రమిదలతో సహస్ర దీపోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతిష్ఠానంతరం శ్రీరామ జైత్రయాత్ర ఘనంగా జరిపారు. ఆలయ ట్రస్ట్ ఫౌండర్ కొంపెల్ల శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం

రాజమహేంద్రవరం సిటీ: స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి 16 అర్జీలను స్వీకరించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, సిటీ ప్లానింగ్ అధికారి జీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

మొక్కల కూర్పు అద్భుతం

కడియం: అయోధ్యలో శ్రీరామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని పుల్లా చంటియ్యకు చెందిన శ్రీసత్యదేవ నర్సరీలో శ్రీరాముడు, ఆలయం ఆకృతిలో మొక్కల కూర్పు ఏర్పాటు చేయడం అద్భుతమని బీజేపీ జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సోము వీర్రాజు అన్నారు. సోమవారం రాత్రి ఆయన ఆకృతిని సందర్శించి నర్సరీ రైతు పుల్లా పెదసత్యనారాయణ తదితరులను అభినందించారు. సోము వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.



సత్యదేవ నర్సరీలో సోము వీర్రాజు తదితరులు

కాంగ్రెస్ నాయకుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: అసోంలో రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జోడో న్యాయయాత్రపై ఆ రాష్ట్ర బీజేపీ శ్రేణులు రాళ్ల దాడి చేయడం దారుణమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జాంపేటలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం

ప్రకాశం నగర్: రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకు పోయిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం చింతలపూడి సునీల్ అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా సహాయ కార్యదర్శులు కుండ్రపు రాంబాబు, రేఖ భాస్కరావు నగర కార్యదర్శి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

సీతానగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టడానికి, ముఖ్యమంత్రిగా జగన్‌ను మరోసారి ఆశీర్వదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆయన సోమవారం సీతానగరంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో రానున్న రోజుల్లో మరింత ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించి, అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు డాక్టర్ బాబు, బూత్ కమిటీల అధ్యక్షుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, పట్టపగల విష్ణుప్రసాద్, జక్కంపూడి జగపతి, సత్తి పందురాజు, కొంచ భాస్కరరావు, ముదునూరి రామకృష్ణరాజు, వీరన్నబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో అక్షయాన్నామృతం (అన్నసమారాధన) కార్యక్రమం సోమవారం కొనసాగింది. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అయిల రామకృష్ణ, తాతపూడి చక్రవర్తి పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు.

సీతానగరం: వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయం వద్ద జక్కంపూడి అక్షయామృత నిత్యాన్నదాన సేవా పథకం కొనసాగిస్తామని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న తెలిపారు. పార్టీ నాయకులు డాక్టర్‌బాబు, జక్కంపూడి జగపతి, ఘంటా శ్రీనివాస్ తదితరులతో కలిసి సోమవారం ఆ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 16 నుంచి సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ వద్ద బహిరంగ ప్రదేశంలో నిర్వహించామని, ఇకపై పార్టీ కార్యాలయం వద్ద జరుగుతుందన్నారు.

పింఛన్, సదుపాయాలు కల్పించాలి

ప్రకాశం నగర్ : దేవదాయ ధర్మదాయ ఆలయాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆలయ ఉద్యోగులు, అర్చకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి పింఛన్, ఇతర సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ఆలయ అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక పుష్కర ఘాట్ వద్ద ప్రదర్శన నిర్వహించారు.